


షెడ్యూల్ ప్రకారం రీ వెరిఫికేషన్



రాజాం ఏరియా ఆస్పత్రిలో విజువల్ రీ వెరిఫికేషన్ పరిశీలిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: నియోజకవర్గంలో పలు పంచాయతీల్లోని దివ్యాంగులకు ఆరోగ్య తనిఖీలు, సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం జరుగుతోందని వెలుగు ఏసీ చిరంజీవి అన్నారు. రాజాం ఏరియా ఆస్పత్రిలో జరుగుతున్న సదరం ధ్రువీకరణల రీ వెరిఫికేషన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ముందుగా గ్రామ సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు సమాచారం ఇస్తున్నామని, వారి కుటుంబీకులు వారిని ఆ షెడ్యూల్ ప్రకారం ఆస్పత్రికి తీసుకొచ్చి దగ్గరుండి వెరిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా వెలుగు సిబ్బంది చర్యలు తీసుకున్నారని, ప్రతీ రోజు వంద మందికి రీ వెరిఫికేషన్ జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎం గోవిందరావు తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌గా రవిశంకర్

వంగర: మండల పరిధి మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కోట రవిశంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకులుగా కొనసాగుతున్న ఆయనకు పదోన్నతి రావడంతో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.

బాడంగిలో యూనియన్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

బాడంగి: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రజలకు మరింత సేవలందించాలన్న లక్ష్యంతో బాడంగిలో కొత్తగా బ్రాంచిని ప్రారంభించినట్టు విశాఖకు చెందిన జోనల్ మేనేజర్ షామ్మీమీరజ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచిని ప్రారంభించారు. విజయనగరానికి చెందిన రీజనల్ అధికారి పి.నరేష్, స్థానిక బ్రాంచి మేనేజర్ బి.చిరంజీవి, ఇతర రీజనల్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల వినతులపై ఆడిట్

రాజాం సిటీ: ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి ఎల్.జోషఫ్ శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. వచ్చిన వినతుల వివరాలు అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిపై అధికారులు ఎంత వరకు స్పందించారన్న వివరాలపై ఆరా తీశారు. డీటీ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంతాపం



రమణమ్మ(ఫైల్)

సంతకవిటి: మండలంలోని మంతిన(ఎంపీటీసీ) ప్రాదేశిక సభ్యురాలు మూల రమణమ్మ గురువారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ సిరిపురపు మంజు, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, వైస్ ఎంపీపీలు గురుగుబెల్లి పావని, పందు పాపారావు, సర్పంచ్ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

పరామర్శ

రామభద్రపురం: మండల కేంద్రంలోని కనిమెరక వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కనిమెరక శ్రీనివాసరావు(డాన్ శ్రీను)అనారోగ్యంతో శుక్రవారం చనిపోయాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కుటుంబ సభ్యులను పరిమర్శించి ఓదార్చారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు ఎంపీటీసీ బవిరెడ్డి చంద్రరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు తదితరులు ఉన్నారు.

జీఓ విడుదల చేయాలి

బొబ్బిలి: పౌర సరఫరాల సంస్థ గోదాముల్లో పని చేస్తున్న హమాలీల కూలీ రేట్లు ఈ సరికే పెంచే జీఓ విడుదల చేయాల్సి ఉందనీ, కానీ నేటికీ పెంచకపోవడంతో హమాలీలు తీవ్ర నష్టానికి గురవుతున్నారని హమాలీల సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్లు నర్సింహులు అన్నారు. పట్టణంలోని సివిల్ సప్లెస్ గొడౌన్‌ల వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంటనే జీఓ జారీ చేసి తదనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు.









